క్లుప్తంగా

మండలకేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్: మండలకేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చింతోజు బాలయ్య శనివారం రెండు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. మండలకేంద్రంలో వేలాదిమంది పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక, ఉన్నత చదువులకు దూరమతున్నారన్నారు. గత ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేసినట్లు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ముఖ్యంగా బాలికలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారన్నారు. కోల కృష్ణ, శ్రీనివాస్‌రావు, దీటి సత్తయ్య తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేటలో మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నేవూరి కమలాకర్‌రెడ్డి, కార్యదర్శి నరసింహరాజు, కోశాధికారి గొల్లపల్లి నాగరా జుగౌడ్, ప్రతినిధులు సంతోష్‌రెడ్డి, కిషన్, పోతుల నారాయణ పాల్గొన్నారు.

నేడు శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షు డు కొత్తపల్లి దేవయ్య, తాజా మాజీ ఎంపీటీసీ పద్మ శనివారం తెలిపారు. మారుమూల గ్రామాల నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్ర జా పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి అధికారులు, గ్రామంలోని అన్ని కులసంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

వర్షాలు కురవాలని జలాభిషేకం

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో వర్షాలు కురవాలని వేడుకుంటూ గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం కప్పతల్లి ఆట ఆడారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై ఆరోపణలు

తంగళ్లపల్లి: మండలంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడిపై ఓ మహిళ ఆరోపణలు చేసింది. మండలకేంద్రానికి చెందిన చంద్రకళ తన కూతురు వివాహం ఏడాదిన్నర క్రితం జరిగిందని, కల్యాణలక్ష్మి చెక్కు కోసం కాంగ్రెస్ నాయకుడికి రూ.7వేలు ఇచ్చినట్లు ఆరోపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే ఉదయం కాంగ్రెస్ నాయకుడిపై ఆరోపించిన సదరు మహిళ మధ్యాహ్నం మాట మార్చింది. తనకు చెక్కు రాలేదనే ఆగ్రహంతో సదరు కాంగ్రెస్ నాయకుడిపై ఆరోపణలు చేశానని విలేకరులకు తెలిపింది. తాను ఎవరికి డబ్బులు ఇవ్వలేదని తెలుపుతూ మరో వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడం గమనార్హం. మండలకాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మూలంగానే ఇలాంటి ఆరోపణలు ఒకరికొకరు చేసుకుంటున్నారని మండలంలో చర్చ జరుగుతోంది.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్: మండలంలోని సింగిల్‌విండోలో రైతులకు రూ.66 లక్షల దీర్ఘకాలిక రుణాలను శనివారం పంపిణీ చేసినట్లు చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి తెలిపారు. గొర్రెల పెంపకానికి రూ.25.50లక్షలు, కర్షక మిత్ర పథకం ద్వారా రూ.40.50 లక్షల విలువైన చెక్కులను ప్రభుత్వ విప్ ఆదివారం శ్రీనివాస్ చేతుల మీదుగా రైతులకు అందించినట్లు తెలిపారు. రైతులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కోరారు.

పేదలకు అన్నదానం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ సమీపంలోని పేదలకు పలువురు దాతలు శనివారం అన్నదానం చేశారు. మై వేములవాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 1174 రోజులుగా నిరంతరం అన్నదానం చేస్తున్నట్లు ఈ సందర్భంగా మధు మహేశ్ తెలిపారు.

వర్షాకాలం.. 'హాట్'వ్యాపారం

సిరిసిల్లటౌన్: వర్షాకాలంలో ప్రజలు వేడివేడిగా స్నాక్స్‌ను కోరుకుంటున్నారు. సాయంత్రం వేళల్లో చల్లని వాతావరణంలో హాట్‌హాట్‌గా స్నాక్స్‌ను తింటూ ఎంజాయ్ చేస్తున్నారు. ఆకలికి ఉపశమనం కోసం కొందరు.. నోటికి రుచిగా ఉండేందుకు హాట్‌హాట్‌గా ఆహారం తీసుకునేవారితో పట్టణంలోని అన్నిస్నాక్స్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. వానాకాలంలో చిరు వ్యాపారులకు కలిసొస్తున్న ఉపాధిపై సండే స్పెషల్ కథనం..













- పట్టణంలో జోరుగా చిరుతిళ్ల వ్యాపారం
- కరకర కట్ మిర్చి..వేడి వేడి స్నాక్స్
- సాయంత్రం వేళలో విరివిగా అమ్మకాలు
- కిక్కిరిసిపోతున్న స్టాల్స్

గ్యారెంటీ ఉపాధి..

చిరు వ్యాపారులకు హాట్ హాట్..క్రిస్పీ..క్రిస్పీ కట్‌మిర్చి, బజ్జీలు, మిరపకాయ బజ్జీలు, మూంగ్ పకోడి వగైరా చిరు తిళ్లతో ఉపాధి గ్యారెంటీ దొరుకుతుంది. వర్షాకాలంలో వీటికి గిరాకీ పెరగడంతో వారికి మరింత కలిసొస్తుంది. ఎప్పటికప్పుడు వేడివేడిగా తయారు చేస్తూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 వరకు అమ్మకాలు సాగిస్తూ పార్ట్ టైంగా నిత్యం గ్యారెంటీ ఉపాధిని పొందుతున్నారు. పట్టణం మొత్తంలో వందలసంఖ్యలో చిరుతిళ్ల హోటళ్లు, బజ్జీల బండ్లు, రోడ్డు పక్కన దుకాణాలు వెలిశాయి. చిరుతిళ్ల వ్యాపారంపై ఆధారపడి సుమారు 500 వందల మంది ఉపాధి పొందుతున్నారు. వివిధ రుచులను ఆస్వాదించే వారికి తగ్గట్టుగా చిరు వ్యాపారులు తమ స్టాల్స్‌లో రెడీమేడ్ స్నాక్స్‌ను అందిస్తున్నారు.

స్పెషల్.. కట్‌మిర్చి..

పట్టణ ప్రజలు సాయంత్రం వేళలో ఎక్కువగా కట్‌మిర్చిని కోరుతున్నారు. వేడిగా కట్‌మిర్చి, మిరపకాయ బజ్జీలు ఇక్కడి ప్రజలు స్పెషల్‌గా ఆదరిస్తారు. దీంతో పట్టణంలోని బజ్జీలు అమ్మే చిరుతిళ్ల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలో గాంధీచౌక్, కలెక్టర్ ఆఫీస్‌రోడ్, మున్సిపల్‌రోడ్, అంబేద్కర్ చౌరస్తా, పాతబస్టాండ్, గోపాల్‌నగర్, సుభాష్‌నగర్, కొత్తబస్టాండ్, బీవైనగర్ తదితర ప్రాంతాల్లోని హోటళ్లు, సాయంత్రం వేళల్లో జరిగే మొబైల్ వ్యాపార బండ్లకు గిరాకీ ఎక్కువగా ఉంది. వీటిలో ఎక్కువగా కట్ మిర్చికి డిమాండ్ ఉంది. అప్పుడే కడాయిలోంచి తీసిన కట్ మిర్చిలో నిమ్మకాయ పిండి ఉల్లిపాయలు, కోతిమీర వంటి మసాలాలు కలుపుకొని కట్ మిర్చీలను తింటున్నారు. హోటల్‌కు వెళ్లలేని వారు ఆర్డర్‌పై తెప్పించుకుంటున్నారు.

బజ్జీలు..పకోడీలు

రోజూ సాయంత్రం కాగానే చిరు వ్యాపారులు, మిర్చీలు, పకోడిలు, మూంగ్ పకోడి, వెజ్ మంచూరియా, ఆలుబజ్జీ, ఎగ్ బజ్జీ, పునుగులు, తదితరాలను వేడివేడిగా అందిస్తున్నారు. పట్టణంలో సాయంత్రం వేళలో నడిచే చిరు తినుబండారాల స్టాళ్లు, పొద్దంతా నిర్వహించే హోటళ్లు వందల సంఖ్యలో ఉండగా..రెడీమేడ్ స్నాక్స్ అమ్ముతున్నారు. సాయంత్రం 5గంటలు దాటితే చాలు ఆయా స్టాళ్లు కిక్కిరిసిపోతున్నాయి. పప్పు దినుసులతో తయారయ్యే మూంగ్ పకోడిలు, కట్ మిర్చీలు కరకరలాడుతూ.. క్రిస్పీగా ఉంటున్నాయి.

ఈవినింగ్ స్నాక్స్ తీసుకుంటా



చలికాలం సాయంత్రం కాగానే వేడివేడిగా ఏదైనా తినాలనిపిస్తుంది. నోటికి రుచిగా నిర్వాహకులు తయారు చేసే స్టాల్స్‌లో ప్రత్యేకమైన కట్‌మిర్చి తింటే ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఈవినింగ్ స్నాక్స్‌గా వీటిని తీసుకోవడానికి ఎక్కువ ఇష్టపడుతా. మంచి నూనె వాడే స్టాల్‌కే వెళ్తాం.

– కట్కం ఉపేందర్, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు

తెలిసిన స్టాల్స్‌లోనే తింటాం.



ఇతర పట్టణాల కంటే సిరిసిల్లలో దొరికే స్నాక్స్ సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటాయి. మంచి రుచులతో అందించే ఫుడ్ స్టాల్ నిర్వాహకులు పరిశుభ్రత పాటించాలి. నాణ్యమైన నూనెలు వాడాలి. మాకు తెలిసిన స్టాల్స్‌లో హాట్..హాట్ స్నాక్స్‌ను తింటాం. ఫుడ్ సేఫ్టీ అధికారులు స్టాల్స్ నిర్వహణపై పర్యవేక్షించాలి.

– గొట్టె లక్ష్మణ్, సిరిసిల్ల

ఒక్కో స్టాల్‌లో ఒక్కో స్నాక్స్ స్పెషల్..



వేడిగా క్రిస్పీగా ఉండే ఈవ్‌నింగ్ స్నాక్స్‌ను ఇష్టపడుతాం. ఫ్రెండ్స్ కలిసింద్రంటే సాయంత్రం వేళలో మిరపకాయ బజ్జీలు, నోట్లో వేసుకోగానే కరిగిపోయే స్నాక్స్‌ను ఆస్వాదిస్తాం. ఒక్కో స్టాల్‌లో ఒక్కో స్నాక్స్ స్పెషల్‌గా చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా సిరిసిల్లలో మూంగ్ పకోడినీ తయారు చేస్తారు. వీటికి ప్రత్యేక డిమాండ్ ఉంది.

కోడం వెంకట్, ప్రైవేట్ ఉద్యోగి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: జిల్లాకేంద్రం పరిధిలోని చంద్రంపేట, శివనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ అధికారులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పాత బస్టాండ్, వెంకంపేట, సంజీవయ్యనగర్, ఆటోనగర్, ఆసిఫ్‌పుర, అశోక్‌నగర్, అనంతనగర్, అంబికానగర్, కోర్టు ఏరియా, సర్దార్‌నగర్, శాంతినగర్, అంబేద్కర్‌నగర్, రాళ్లబావి, దోబీగల్లి, రెడ్డివాడ, వెంకటేశ్వర టెంపుల్, గాంధీనగర్, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, విద్యానగర్, గీతానగర్, పోచమ్మ టెంపుల్ ఏరియా, సుభాష్‌నగర్, చంద్రంపేట, రగుడు, నెహ్రూనగర్, వెంకట్రావునగర్, గోపాల్‌నగర్, గణేశ్‌నగర్, బీవైనగర్, శివనగర్, కొత్త బస్టాండ్, ఇందిరానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

ప్రొటోకాల్ రగడ



కేంద్రమంత్రి బండి సంజయ్ ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సిరిసిల్లటౌన్: కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించలేదని బీజేపీ సీనియర్ నాయకుడు అన్నల్‌దాస్ వేణు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పీఆర్ గెస్ట్‌హౌజ్‌లో మున్సిపల్ పరిధిలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. ప్రభుత్వ సంబంధిత కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో అధికారులు కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ ఫొటో లేదని అన్నల్‌దాస్ వేణు ఆరోపించారు. కావాలనే అధికారులు బండి సంజయ్ ఫొటోను ఏర్పాటు చేయలేదన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ పాటించకపోవడంలో అధికారుల వైఫల్యమేనని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఫ్లెక్సీలో కేంద్రమంత్రి బండి సంజయ్ ఫొటో లేకపోవడం సరికాదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్



కోనరావుపేట: చెక్కు అందిస్తున్న నాయకులు



రుద్రంగి : చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట: మండలంలోని కనగర్తి, వెంకట్రావుపేట గ్రామాల్లో సీఎం ఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. వెంకట్రావుపేటలో సందు కనుకవ్వకు మంజూరైన రూ.12వేల చెక్కును కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా అందజేశారు. కనగర్తిలో మీన జ్యోతికి, నిజామాబాద్‌లో బొల్లు లావణ్య, వంగపెల్లి ముత్తయ్యకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదాల్లో గాయపడి అత్యవసర సమయంలో చికిత్స పొందే నిరుపేదలకు సీఎం సహాయనిధి వరమన్నారు. తాళ్లపెల్లి ప్రభాకర్, రాజు, దేవరాజు, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, జొర్రీగ వెంకటేశం, మంతెన నరేశ్, తిక్కల సాగర్, కుమ్మరి తిరుపతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలకేంద్రానికి చెందిన లక్కాకుల గంగాజల, ఉప్పలూటి పెద్దగంగారాం, పుటకపు సురేశ్, చిప్ప గణేశ్, దేశవేని జలగారాకు రూ. 1.30 లక్ష విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు తిరుపతిరెడ్డి, గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లిలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. రాచర్లగొల్లపల్లిలో ప్రతి శనివారం వారసంత జరుగుతుండగా చిల్లర దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో సంతలో సైతం పోలీసులు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేసి వారి వివరాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగుల్లో బదిలీల భయం

వేములవాడ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర దేవాలయాలకు బదిలీ చేసేందుకు రాష్ట్ర దేవాదాయశాఖ కసరత్తు పూర్తి చేసస్తోంది. దీంతో ఆయా ఆలయాల నుంచి ఉద్యోగుల వివరాలను తెప్పించుకున్నారు. దీంతో వేములవాడ రాజన్న ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సైతం స్థానచలనం కలగనుందన్న సమాచారం ఉంది. దీంతో ఇక్కడి చాలామంది ఉద్యోగులు సెలవులు పెట్టి పెద్దఎత్తున పైరవీలు చేసేందుకు తరలివెళ్లినట్లు సహచర ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇందులో ఇక్కడి దేవస్థానం నుంచి తరలడం ఖాయమని తెలియడంతో సమీపంలోని ఆలయానికి వెళ్లేందుకు పైరవీలు చేస్తున్నట్లు తెలుసస్తోంది. మొత్తానికి త్వరలోనే ఉద్యోగులకు బదిలీల ఆర్డర్లు అందనున్నట్లు సమాచారం

అనుమతులు లేని నిర్మాణాలను తొలగించాలి

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లి డబుల్ బెడ్ రూంలకు సంబంధించిన ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని తహసీల్దార్ సురేశ్‌కు నాయకులు గాడిచర్ల రామచంద్రం, జంగా ప్రభాకర్‌రెడ్డి, బాపురెడ్డి, రాజు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను తక్షణమే తొలగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. సంఘం పేరిట చేపట్టిన నిర్మాణాలతో పేదలకు ప్లాట్లు దక్కకుండా పోతాయని వారు వినతిప్రతంలో పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, ఎస్పీ అఖిల్ మహాజన్

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తంగళ్లపల్లి: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఇల్లంతకుంట మండల పోలీస్‌స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ...విరివిగా మొక్కలు నాటితే భావి తరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించిన వారమవుతామన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ... చెట్లు మానవాళి అవసరాల కోసం నరికివేయడం, అందుకు అనుగుణంగా మొక్కల పెంపకం చేపట్టకపోవడంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ సీఐ మొగిలి, ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి మండలకేంద్రంలో

తంగళ్లపల్లి మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం రూరల్ సీఐ మొగిలి, ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ మొగిలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ వెంకటేశ్వర్లు శనివారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన సూచించారు. గ్రీన్ పోలీస్‌స్టేషన్‌గా మార్చేందుకు 200కు పైగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చందుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది



కోనరావుపేట రాణాలో..

కోనరావుపేట: వన మహోత్సవంలో భాగంగా మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో సుమారు 300 మొక్కలు నాటారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



నిర్వహణపై నిర్లక్ష్యం.!







గంభీరావుపేట: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో సకల వసతులు, ఆధునిక హంగులతో కార్పొరేట్‌ను తలదన్నేలా కేజీ టు పీజీ విద్యా ప్రాంగణాన్ని రాష్ట్రంలోనే మొదటిసారిగా గంభీరావుపేటలో మండలకేంద్రంలో నెలకొల్పారు. అయితే దాని పర్యవేక్షణ కరువై విద్యాప్రాంగణం ఆవరణలో కొన్ని చోట్ల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. విద్యార్థులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, సామగ్రి ఊడిపోతున్నాయి. విద్యాసంస్థల నేమింగ్ బోర్డులపై నుంచి కొన్ని అక్షరాలు మలిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేజీ టు పీజీ విద్యా ప్రాంగణంలో అన్ని వసతులు సమకూరేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కుక్కలదాడిలో గేదెలు మృతి

ముస్తాబాద్: వీధికుక్కల దాడిలో రెండు గేదెలు మృతిచెందాయి. మండలకేంద్రానికి చెందిన బండి మహేశ్ పశువుల పాకలో ఉన్న రెండు గేదెలపై వీధకుక్కలు దాడిచేయగా మృతిచెందాయి. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.